సాక్షి నంద్యాల

శనివారం, 20, సెప్టెంబర్, 2025



స్తంభించిన రిజిస్ట్రేషన్ సేవలు

దస్తావేజు రైటర్ల పెన్‌డౌన్‌తో రిజిస్ట్రేషన్ సేవలు స్తంభించిపోయాయి. మ్మడి కర్నూలు జిల్లాలోని 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగలేదు.

IIలో▸



శాస్త్రోక్తంగా ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:11,351
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:11,146

న్యూస్‌రీల్

నర్సాపురంలో డెంగీ కేసు



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

రుద్రవరం: నర్సాపురం ఎస్సీ కాలనీకి చెందిన ఓ మహిళ డెంగీ జ్వరం బారిన పడింది. నర్సాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి బాబు శుక్రవారం సిబ్బందితో కలిసి ఎస్సీ కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రెండు రోజులుగా మహిళకు జ్వరం తగ్గకపోవడంతో వైద్యులు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేయగా అక్కడ పరీక్షలు నిర్వహించగా డెంగీ జ్వరం ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. అక్కడే ఆమెకు వైద్యం అందించడంతో కోలుకున్నట్లు వైద్యులు తెలిపారు. గ్రామంలో డెంగీ కేసు నమోదు కావడంతో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ గ్రీన్ అంబాసిడర్లతో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.


'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్ రెడ్డి

బండి ఆత్మకూరు: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని డీఈఓ జనార్దన్ రెడ్డి ఉపాధ్యాయులను ఆదేశించారు. మండలంలోని పలు పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రెడ్డి సందర్శించి బోధన, సౌకర్యాలు, విద్యార్థుల హాజరు, ఇటీవల పాఠశాల ముంపునకు గురైన ప్రాంతాన్ని పరిశీలించి, పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించి పదవ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త ఎండీ ప్రసన్నకుమార్, జిల్లా ప్రణాళిక, సహిత విద్యా సమన్వయకర్త ఎస్. జగన్ మోహన్ రెడ్డి గిరిజన ఆవాస ప్రాంతాల్లోని నెమళ్లకుంట, నారపురెడ్డి కుంట పాఠశాలలను సందర్శించారు. వారి వెంట ఎంఈఓ మోహన్ రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అబ్దుల్ రఫీ తదితరులు ఉన్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీటివిడుదల తగ్గింపు



జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను 8వేల నుంచి 5వేల క్యూసెక్కులకు తగ్గించినట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయంలోకి 2,24,882 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా డ్యాంలో సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో 884.40 అడుగుల నీటి మట్టం ఉందన్నారు. పోతిరెడ్డిపాడు వద్ద 883.40అడుగుల నీటిమట్టం నమోదు కాగా హెడ్‌రెగ్యులేటర్ నాల్గవ గేటు నుంచి 1,500 క్యూసెక్కులు, ఎస్‌సీఎల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి 3,500క్యూసెక్కుల నీటిని ఎస్సార్‌ఎమ్సీ కాల్వలోకి విడుదల చేస్తున్నామన్నారు. బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగకు 3వేల క్యూసెక్కులు, ఎస్సార్బీసీ(జీఎన్ఎస్ఎస్) కాల్వకు 1,000, కేసీ ఎస్కేప్ కాల్వకు 1,000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ



కలెక్టర్‌కు పూల మొక్కను అందజేస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల: జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాని జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల నంద్యాల నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సునీల్ షెరాన్, కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో కలువలేకపోయారు. ఈ క్రమంలో ఎస్పీ కలెక్టర్‌కు పూల మొక్క అందజేసి అభినందనలు తెలిపారు.



నంద్యాల.. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసాను అడ్డుకున్న పోలీసులు



నందికొట్కూరు: పటేల్ సెంటర్‌లో కేజీ రోడ్డుపై బైఠాయించిన దారా సుధీర్, వైఎస్సార్‌సీపీ నేతలు



నంద్యాల.. నాయకులను అరెస్ట్ చేసి తరలిస్తున్న దృశ్యం

ఆంక్షలతో నిలువరించి.. అరెస్టులతో బెదిరించి!

- 'చలో మెడికల్ కాలేజీ' కార్యక్రమంపై పోలీసుల ఉక్కుపాదం
- జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల అడ్డగింతలు, అరెస్ట్‌లు
- ప్రధాన రహదారుల్లో బారికేడ్లు పెట్టి వాహనాల తనిఖీలు
- బలవంతంగా జీపులు, వాహనాల్లో పోలీసు స్టేషన్‌కు తరలింపు
- కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడిన నేతలు





నంద్యాల మెడికల్ కళాశాల వద్ద మోహరించిన పోలీసు బలగాలు

నంద్యాల: కూటమి ప్రభుత్వం ప్రజాస్వేచ్ఛకు సంకెళ్లు వేసింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఇచ్చిన 'చలో మెడికల్ కాలేజ్' కార్యక్రమాన్ని పోలీసులతో అణిచివేసేందుకు ప్రయత్నించింది. అడుగడుగునా ఆంక్షలు విధిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎవరూ నంద్యాలకు రాకుండా అడ్డుకుంది. పోలీసు యాక్టు 30 అమలులో ఉందంటూ పోలీసులను మోహరించి బలవంతంగా అరెస్ట్‌లకు పాల్పడింది. నంద్యాల మెడికల్ కళాశాల వైపు వచ్చే అన్ని రహదారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఉంటే వారిని వెంటనే దగ్గరలోని పోలీసు స్టేషన్లకు తరలించి సాయంత్రం విడుదల చేశారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తామని.. తమను అడ్డుకోవద్దని పోలీసులను ఎంత వేడుకున్నా కనికరించ లేదు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పోలీసుల కళ్లు గప్పి కొందరు మెడికల్ కళాశాల వద్దకు చేరుకున్నా బలవంతంగా జీపుల్లో, లారీల్లో ఎక్కించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమానికి వేలాది మంది వైఎస్సార్‌సీపీ శ్రేణులు, విద్యార్థులు తరలి వస్తారనే సమాచారంతో గురువారం రాత్రి నుంచే అడ్డంకులు సృష్టించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. పోలీసుల బెదిరింపులకు భయపడకుండా ఆయా నియోజకవర్గాల నుంచి తరలి వస్తున్నా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అడుగడుగునా అడ్డుకున్నారు. మెడికల్ కళాశాల వద్దకు వచ్చిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి శశికళారెడ్డి, కొండజూటూరు సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డితో పాటు మరో 100 మందిని బలవంతంగా పోలీసులు అరెస్ట్ చేసి పట్టణంలోని త్రీటౌన్ స్టేషన్‌కు తరలించారు.

బైరెడ్డి సిద్దార్థ రెడ్డి హౌస్ అరెస్టు..

'చలో నంద్యాల మెడికల్ కాలేజీ' కార్యక్రమంలో పాల్గొనాల్సిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు బైరెడ్డి సిద్దార్థ రెడ్డిని కర్నూలు మూడవ పట్టణ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. తెల్లవారు జామున 4 గంటలకే పోలీసులు ఇంటి వద్దకు చేరుకొని మోహరించారు. విషయం తెలుసుకున్న యువజన విభాగం కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. శాంతి యుతంగా చేపడుతున్న కార్యక్రమానికి సైతం పోలీసులు అనుమతి ఇవ్వలేదు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి బైరెడ్డి సిద్దార్థ ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు.

నలువైపులా మోహరించి..

నంద్యాల పట్టణంలోని మెడికల్ కళాశాల వద్దకు ఎవరో రాకుండా అడ్డుకోవడానికి భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలోని సీఐలు, ఎస్ఐలు అందరూ మెడికల్ కళాశాల వద్ద మోహరించారు. మెడికల్ కళాశాల వద్దకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎవరూ రాకుండా నూనెపల్లెలోనే ఆసుపత్రి వద్ద, రైతునగరం బ్రిడ్జి వద్ద, బొమ్మలసత్రంలోని గాంధీనగర్ వద్ద సీఐలు, ఎస్ఐలు ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీ చేసిన తర్వాతనే పంపారు. వాహనంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉంటే వారిని కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకొని వెనక్కి పంపారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, మండ ల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు ఎవరూ కళాశాల వద్దకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు సన్నల సాయి రాంరెడ్డిని స్వగృహంలో అరెస్ట్ చేశారు. మున్సిపల్ చైర్మన్ మాబున్నిసాను గాంధీనగర్ వద్ద ఆపి కార్యక్రమానికి రాకుండా వెనక్కి పంపించారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సురేష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి అమృతరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి, మరో 100 మందికి పైగా కార్యకర్తలు మెడికల్ కళాశాల వద్దకు చేరుకోగా వారిని బలవంతంగా పోలీసులు అరెస్ట్ చేసి జీపుల్లో, లారీల్లో త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించి సాయంత్రం విడుదల చేశారు.

ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తాం



మీడియాతో మాట్లాడుతున్న సురేష్‌యాదవ్, చిత్రంలో శశికళారెడ్డి

కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై వెనుకడుగు వేసే వరకు ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌యాదవ్ హెచ్చరించారు. చంద్రబాబు మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి పూనుకొని చరిత్రహీనుడిగా మిగిలిపోతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ శాంతియుతంగా నిరసన కార్యక్రమానికి పిలుపునిస్తే దానిని పోలీసులతో అణిచివేసి ప్రజాస్వేచ్ఛను కాలరాస్తున్నారన్నారు. అరెస్ట్‌లకు వైఎస్సార్‌సీపీ నాయకులు భయపడరని, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకునేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.

రహదారుల్లో తనిఖీలు చేస్తూ..

- నందికొట్కూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ధారా సుధీర్ ఆధ్వర్యంలో దాదాపు 400 మందికి పైగా నంద్యాలకు వస్తుండగా పట్టణ సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు.
- బనగానపల్లె నియోజకవర్గం నుంచి పార్టీ నేతలు అంబటి రవికుమార్, సిద్ధంరెడ్డి రామిరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డిలతో పాటు మరో 300 మంది కార్యక్రమానికి వేర్వేరుగా వస్తుండగా కొందరినీ నందవరం వద్ద, మరికొందరిని నంద్యాల బొమ్మలసత్రంలోని గాంధీనగర్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు.
- డోన్ నియోజకవర్గం నుంచి జెడ్పీటీసీ రాజ్‌కుమార్, పార్టీ నేతలు కిట్టిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పుల్లారెడ్డి, మరో 200 మంది నంద్యాలకు వస్తుండగా బేతంచెర్ల వద్ద పోలీసులు అరెస్ట్ చేసి సాయంత్రం వదిలేశారు.
- ఆళ్లగడ్డ వైఎస్సార్‌సీపీ యూత్‌వింగ్ అధ్యక్షుడు శీను, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు కుమార్ ఆధ్వర్యంలో భారీగా ప్రజలు చలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి వస్తుండగా రైతునగరం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు ఆపి అడ్డుకున్నారు.

చంద్రబాబుకు ప్రజా వ్యతిరేకత తప్పదు

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి. చిత్రంలో యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, దారా సుధీర్ తదితరులు

కర్నూలు(టౌన్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1992 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ నేదురుమల్లి జనార్దన్ రెడ్డి ఒకేసారి 10 ప్రయివేట్ వైద్య కళాశాలలను తీసుకొచ్చిన సమయంలో ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక రాజీనామా చేశారని, అవే పరిస్థితులను సీఎం చంద్రబాబు ఎదుర్కొనక తప్పదని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం కర్నూలులోని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న మంచి ఉద్దేశంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేశారన్నారు. నిర్వహణ చేతకాని చంద్రబాబు నాయుడు ఆ వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిన తమ అనుయాయులకు కట్టబెట్టేందుకు ప్రైవేటీకరణ చేస్తున్నాడన్నారు. ప్రయివేటు వైద్య కళాశాలల నిర్వహణలో వైద్య సీట్లు రూ.లక్షలకు అమ్ముకునేందుకు చంద్రబాబు నాయుడు కుట్ర చేస్తున్నాడన్నారు.

- వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు కోసం పోరాటం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలను ఈ ప్రభుత్వం ఇబ్బందులు పెడుతోందన్నారు. ఏడాదిన్నరలోపే ఈ ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. కనీసం రైతులకు యూరియా అందించలేని స్థితిలో ఉందన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదన్నారు. విద్యుత్ చార్జీలు పెంచడంతో సామాన్యులు, పేద వర్గాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. చంద్రబాబు కార్పొరేట్ వర్గాలకు కట్టబెట్టేందుకు పీపీపీ విధానాన్ని తీసుకొచ్చాడన్నారు. 42 శాతం సీట్లు కన్వీనర్ కోటాలో భర్తీ చేసినప్పుడు ఆ డబ్బులు ప్రభుత్వానికే వస్తాయన్న ఇంగిత జ్ఞానం బాబుకు లేదన్నారు.
- నందికొట్కూర్ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దారా సుధీర్ మాట్లాడుతూ 1995 నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు పేదల గురించి ఏనాడు మాట్లాడలేదన్నారు. సమావేశంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కాటసాని ఓబుల్ రెడ్డి, జెడ్పీటీసీ పోచా జగదీశ్వర్ రెడ్డి, పార్టీనేతలు గుండం సూర్యప్రకాష్ రెడ్డి, మండల కన్వీనర్ పుల్లెల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో రైతులకు అన్యాయం



యంబాయి గ్రామంలో ఉల్లి రైతులతో మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన

బేతంచెర్ల: కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి రైతులకు అన్యాయం చేస్తుందని ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. సకాలంలో రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఇవ్వకపోగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. శుక్రవారం మండల పరిధిలోని యంబాయి గ్రామంలో రైతు శాలిమియా ఆరబోసిన ఉల్లి పంటను బుగ్గన పరిశీలించారు. నాలుగు ఎకరాల్లో రూ. 2లక్షల దాక ఖర్చు చేసి ఉల్లి పంటను సాగు చేశానని, పంట పండింది కాని ప్రస్తుతం గిట్టుబాటు ధర లేకపోవడంతో రూ. 50 వేలు కూడా రావని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఉల్లి పంట క్వింటా రూ. 500 అడుగుతున్నారన్నారు. ఉల్లితో పాటు టమాట, మిరప పంటలకు కూడ ధర లేదని రైతులు బుగ్గనకు విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో సకాలంలో విత్తనాలు, ఎరువులు, యూరియా రైతులకు అందుబాటులో ఉంచడమే కాకుండా పండిన పంటలకు మద్దతు ధర కల్పించామన్నారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వ పాలనలో పంటల మద్దతు ధర కోసం, యూరియా కోసం రైతులు రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రైతు సమస్యలను పరిష్కరించకపోతే కూటమి ప్రభుత్వం రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సివస్తుందని బుగ్గన హెచ్చరించారు.

'చట్టం దృష్టిలో అందరికీ న్యాయ సహాయం'పై పోటీలు

- న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు: 'చట్టం దృష్టిలో అందరికీ న్యాయ సహాయం' అనే అంశంపై ఫొటోగ్రఫీ, పెయింటింగ్, స్కెచ్, వీడియో పోటీలను నిర్వహిస్తున్నట్లు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది ఆదేశాల మేరకు నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ 'చట్టం దృష్టిలో అందరికీ న్యాయ సహాయం' అనే ఏకీకృత థీమ్‌తో నేషనల్ ఫొటోగ్రఫీ అండ్ ఆర్ట్ షోకేస్‌ను ప్రారంభించింది. పౌరుల నుంచి విద్యార్థుల వరకు న్యాయవాదులు, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు ఈ అంశంపై ఫొటోగ్రఫీ, పెయింటింగ్, స్కెచ్, వీడియోలు అక్టోబర్ 3వ తేదీలోగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారికి నామినేషన్లను పంపాల్సిందిగా లీలా వెంకటశేషాద్రి విజ్ఞప్తి చేశారు.

45 కేజీల ఉల్లి బస్తా రూ.100

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మార్కెట్ యార్డులో వంద రూపాయిలకే సుమారు 45 కేజీల ఉల్లి బస్తాలను విక్రయించనున్నట్లు జేసీ డాక్టర్ బి.నవ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 21వ తేదీన ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మార్కెట్‌లోని గోదాము నెం.7లో ఉల్లి బస్తాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆటో బోల్తా పడి విద్యార్థి మృతి

ఆస్పరి: ఆటో బోల్తా పడి 8వ తరగతి విద్యార్థి పులి మున్నా (15) మృతి చెందినట్లు ఆస్పరి సీఐ గంగాధర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు మేరకు.. కొతాళం మండలం బదినేహాల్ గ్రామానికి చెందిన ఎరుకుల మారుతి, ఎరుకుల తిమ్మప్ప కలసి కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. వీరిద్దరి వెంట ఆటోలో శుక్రవారం పులి మున్నా అనే బాలుడు కూడా వచ్చాడు. ఆస్పరి మార్కెట్లో కూరగాయలను కొనుగోలు చేసేందుకు వెళ్తుండగా చిరుమాన్‌దొడ్డి బస్ స్టాప్ సమీపంలో ఆటో ముందు చక్రం ఊడి పోయింది. అదుపు తప్పి ఆటో బోల్తా పడటంతో మున్నాకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే బాలుడు మృతి చెందినట్లు చెప్పారు. ఆటో డ్రైవర్ ఎరుకుల మారుతి, ఎరుకుల తిమ్మప్పకు గాయాలైనట్లు సీఐ తెలిపారు. బదినేహాల్ గ్రామానికి చెందిన పులి రమేష్, జయ్యమ్మ దంపతులకు ఇద్దరు కమార్తెలు, కుమారుడు ఉన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో వ్యవసాయ శాఖ
ఏడీఏ ఆంజనేయ మృతి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయశాఖ ఏడీఏ బి.ఆంజనేయ(58) అనారోగ్య కారణాలతో శుక్రవారం మరణించారు. ఈయన ప్రస్తుతం నంద్యాల ఏడీఏగా పనిచేస్తున్నారు. నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారిగా కూడా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.న్యూరో సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన 15 రోజులుగా సెలవులో ఉన్నారు. దేవనకొండ మండలం పొట్లపాడు గ్రామానికి చెందిన ఈయన కర్నూలులో నివాసం ఉంటున్నారు. న్యూరో సమస్యలతో పరిస్థితి విషమించడంతో కర్నూలులోని కిమ్స్ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మరణించారు. రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథ్, దస్తగిరి రెడ్డి, డీఏఓ వరలక్ష్మి తదితరులు కుటుంబసభ్యులను పరామర్శించారు.

కుటుంబాన్ని మట్టుబెట్టే యత్నం!

- పెద్ద కొట్టాలలో ఇరు కుటుంబాల ఘర్షణ
- ఇంటిలో పెట్రోల్ పోసి నిప్పంటించి గడియ పెట్టిన వైనం
- సకాలంలో పోలీసుల రాకతో స్వల్ప గాయాలతో బయటపడిన బాధితులు


పోలీసు స్టేషన్ వద్ద ఉన్న చిన్నబాబు కుటుంబ సభ్యులు


కాలిబూడిదైన ఇంట్లోని వస్తువులు


కాలిబూడిదైన లైటింగ్ పరికరాలు

నంద్యాల(అర్బన్): పెద్దకొట్టాల గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య ఏర్పడిన ఘర్షణ తీవ్ర పరిణామాలకు దారి తీసింది. ఓ కుటుంబాన్ని ఇంటిలో పెట్టి నిప్పంటించి మట్టుబెట్టే యత్నం చేయగా పోలీసుల రాకతో ఆ కుటుంబం ప్రాణాలతో బయటపడింది. గ్రామంలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన బండి చిన్నబాబు, సంటెన్నలు కొత్త కాలనీలో నివాసం ఉంటున్నారు. మూడు మాసాల క్రితం తన ఇంటి వద్దకు వచ్చాడని సంటెన్న, తదితరులు చిన్నబాబు కుటుంబంపై దాడి చేశారు. గ్రామ పెద్దల సమక్షంలో జరిగిన పంచాయితీలో చిన్నబాబు కొంత కాలం పాటు గ్రామాన్ని వదలి వెళ్లాలని తీర్పు ఇచ్చారు. నందికొట్కూరు సమీపంలో జీవనం సాగిస్తున్న చిన్నబాబుకు ఇటీవల కుమార్తె జన్మించింది. పాప బర్త్‌డేను పెద్దకొట్టాలలో బంధువుల సమక్షంలో నిర్వహించుకోవాలని చిన్నబాబు గ్రామంలో ఏర్పాట్లు చేసుకున్నారు. గురువారం బంధుమిత్రులు వేడుకలకు హాజరయ్యారు. కాగా తన ఇంటి ముందు వెళ్తున్న చిన్నబాబును సంటెన్న వర్గీయులు ఎగతాళి చేశారని, కోపోద్రిక్తుడైన చిన్నబాబు వారితో ఘర్షణకు దిగారు. అనంతరం రాత్రి వేడుకలు జరుపుకుంటున్న సమయంలో సంటెన్న వర్గీయులు చిన్నబాబు ఇంటిపై దాడికి దిగారు. ఘర్షణ తీవ్రతరం కావడంతో చిన్నబాబు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఆ క్రమంలో సంటెన్న వర్గీయులు చిన్నబాబు ఇంటిలో పెట్రోల్ పోసి నిప్పటించడమే కాకుండా ఇంట్లో ఉన్న వారు ఎవరూ బయటకు రాకుండా గడియపెట్టారు. కేకలు వేస్తున్న సమీపంలో ప్రజలు భయంతో అక్కడికి రాలేకపోయారు.

సకాలంలో పోలీసులు రంగప్రవేశం

అప్పటికే గ్రామంలో ఘర్షణ జరుగుతుందనే సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఇల్లు తగలబడి పోతుండటాన్ని గమనించి తలుపులు తెరిచారు. లోపల మంటల్లో చిక్కుకొని ఉన్న చిన్నబాబు చిన్నమ్మ లక్ష్మీదేవి, సామన్నతో పాటు చిన్నారులు సామేల్ రాజు, కీర్తనలు పరుగుపరుగున బయటకు వచ్చారు. అప్పటికే లక్ష్మీదేవి ఇంట్లో ఉన్న రెండు సిలిండర్లు ఆఫ్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం ఫైర్ ఇంజన్ సాయంతో మంటలు ఆర్పినా ఇల్లు పూర్తిగా కాలిపోయి చిన్నబాబు కుటుంబం కట్టుబట్టలతో రోడ్డున పడింది. కుమార్తె బర్త్‌డేను ఘనంగా జరుపుకోవాల్సిన సమయంలో దాడి చేసుకోవడంతో అందరూ భయాందోళనకు గురయ్యారు. డెకరేషన్ సామగ్రి మొత్తం దగ్ధమైంది. సంటెన్న, చిన్నబాబు పరస్పర ఫిర్యాదు మేరకు ఇరువురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ ఈశ్వరయ్య శుక్రవారం తెలిపారు. గ్రామంలో ఎలాంటి సంఘటనలో చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి

- ఏపీ పవర్ జేఏసీ కర్నూలు జిల్లా చైర్మన్ ఎస్.సతీష్‌కుమార్


విద్యుత్ భవన్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టిన విద్యుత్ ఉద్యోగులు

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏపీ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ కర్నూలు జిల్లా చైర్మన్ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 15 నుంచి వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేస్తున్న జేఏసీ శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టింది. ఇందులో 50 మందికిపైగా పాల్గొన్నారు. రిలే దీక్షలకు పలు సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. విద్యుత్ సంస్థల అభివృద్ధిలో శాశ్వత, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరంతర శ్రమ ఉందన్నారు. చాలీచాలని వేతనాలతో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రాణాలను ఫణంగా పెట్టి విద్యుత్ సంస్థల బలోపేతానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. డిమాండ్‌లను సాధించుకునేందుకు ఏర్పాటైన జేఏసీలో 1104, 327, డిప్లొమా ఇంజనీర్స్, బీసీ, ఓసీ, బహుజన ఉద్యోగ సంఘాలు మొత్తంగా 23 సంఘాలు ఉన్నా యని తెలిపారు. విద్యుత్ ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలని, 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004 ఆగస్టు 31 మధ్య చేరిన ఉద్యోగులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని, దళారీ వ్యవస్థను రద్దు చేసి కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చే శారు. వివిధ విద్యుత్ ఉద్యోగుల సంఘాల నాయకులు మునిస్వామి, గురుమూర్తి, మధుకృష్ణ, రమణ, మల్లికార్జున, ఈ.శ్రీనివాసులు, సుందరయ్య, యల్లప్ప, కె.సత్యం తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన రిజిస్ట్రేషన్ సేవలు


జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైటర్లు

- దస్తావేజు రైటర్ల పెన్‌డౌన్‌తో ఒక్క రిజిస్ట్రేషన్ జరుగని వైనం
- సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగబోదన్న రైటర్లు


విక్రయదారులు లేక వెలవెలబోతున్న కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కర్నూలు(సెంట్రల్): దస్తావేజు రైటర్ల పెన్‌డౌన్‌తో రిజిస్ట్రేషన్ సేవలు స్తంభించి పోయాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎక్కడ కూడా ఒక్క రిజిస్ట్రేషన్ జరుగలేదు. ఫలితంగా నిత్యం క్రయ, విక్రయదారులతో కళకళలాడే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కళ తప్పి కనిపించాయి. ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజూ 500 రిజిస్ట్రే షన్‌ల వరకు జరుగుతాయి. ప్రభుత్వానికి దాదాపు రూ.30 లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు ఆదా యం వస్తుంది. అయితే దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్‌తో ప్రభుత్వ ఆదాయానికి గండి పడగా..విక్రయ దారులు ఇబ్బంది పడ్డారు. శనివారం కూడా పెన్‌డౌన్ కొనసాగుతుందని యూనియన్ నేతలు తెలిపారు.

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళన

కర్నూలులోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట శుక్రవారం దస్తావేజు లేఖరులు ఆందోళన చేపట్టారు. తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకునే వరకు పోరాటం చేస్తామని యూనియన్ నాయకులు ఎస్‌ఏ రహమాన్, మహ్మద్ రఫీక్, చంద్రశేఖర్, రామకృష్ణ, నాగరాజు తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. అలాగే పీడీఈ విధానంలో ఉన్న లోపాలను సరిచేయాలన్నారు. ఆటో మ్యూటేషన్‌లో అనవసరపు నిబంధనలను తొలగించి తమపై పని భారం తగ్గించాలన్నారు. స్లాట్ బుకింగ్‌లో విధానంలో అనేక లోపాలు ఉన్నాయని, వాటిని సరిచేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ స్టాంపింగ్ విధానాన్ని రద్దు చేసి నాన్ జ్యూడిషియల్ స్టాంపులను అందుబాటులోకి తేవాలని కోరారు. నాయకులురాజా, మహేష్, గోపాల్, జగదీష్, భాస్కర్ గౌడ్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

సరిహద్దులో రాకపోకలు బంద్


వంతెన మార్గంలో బురదలో ఇరుక్కున్న లారీ

హాలహర్వి: జిల్లా సరిహద్దులో రాకపోకలు బంద్ అయ్యాయి. హాలహర్వి మండలంలోని చింతకుంట వద్ద కత్రవంక వంతెనపై లారీ ఇరుక్కుపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ వంతెన కూలిపోవడంతో చింతకుంట గ్రామస్తులు మట్టిని వేసి చదును చేశారు. శుక్రవారం ఉదయం బళ్లారి నుంచి కర్నూలు వైపు వస్తున్న లారీ ఈ మట్టిలో దిగబడింది. దీంతో రాకపోకలు నిలిచిపోయి ప్ర యాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె బాట


ఆందోళన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): తమ సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో అక్టోబర్ నుంచి సమ్మెలోకి వెళ్తామని సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు భాస్కరరెడ్డి, శివప్రసాదు, రవి యాదవ్, మగ్బుల్ హుస్సేన్ స్పష్టం చేశారు. ఈనెల 8వ తేదీ నుంచి చేపట్టిన ఆందోళనల్లో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరికి ఆమె కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను సర్వే పేరుతో క్షేత్రస్థాయికి పంపి అవమానాలపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తమ చదువుకు విలువ ఇచ్చి రాష్ట్రాభివృద్ధికి అవసరమైన సేవలను తమతో చేయించుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటింటికీ తిరిగే సర్వేలకు దూరంగా ఉంచాలని కోరారు. తమను తమ శాఖల మాతృసంస్థలకు అప్పగించాలని, సమయపాలన పాటించేలా విధంగా చర్యలు తీసుకొని పని ఒత్తిడి లేకుండా చూడాలని కోరారు. ఆరేళ్ల పాటు ఒకే క్యాడర్‌లో పనిచేసిన వారికి ఏఏఎస్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంటు ఇవ్వాలని, నోషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, తమకు జూనియర్ అసిస్టెంట్ హోదా కల్పించాలని, అన్ని విభాగాల మాదిరిగా పదోన్నతులు కల్పించాలని, స్టేషన్ సినియారిటీ ఆధారంగా బదిలీలు చేపట్టాలని కోరారు.

ప్రైవేట్ బస్సుకు భారీ జరిమానా


పత్రాలు పరిశీలిస్తున్న డోన్ ఎంవీఐ క్రాంతికుమార్

కృష్ణగిరి: రోడ్ ట్యాక్స్ లేకుండా తిరుగుతున్న ప్రైవేట్ బస్సుకు రూ. 4,43,000 జరిమానా విధించినట్లు డోన్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) క్రాంతికుమార్ తెలిపారు. కృష్ణగిరి మండల పరిధిలోని అమకతాడు సమీపాన జాతీయ రహదారిలోని టోల్‌గేట్ వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో పాండిచ్చేరి రాష్ట్రానికి చెందిన బాలాజీ క్యాబ్స్ ట్రావెల్స్‌కు సంబంధించిన బస్సు తమిళనాడులోని శేలం నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ఆపారు. రోడ్ ట్యాక్స్ లేకుండా ఏపీలో తిరుగుతున్నట్లు గుర్తించి రూ. 4,43,000ల జరిమానా విధించినట్లు ఎంవీఐ తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా పత్రాలు లేకుండా తిరిగితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

జూపాడుబంగ్లా: ఆస్తి పంపకం చేయలేదని సొంత పెద్దనాన్నపై కత్తితో దాడి చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు...మండలంలోని 80 బన్నూరు గ్రామానికి చెందిన సీయోను, ప్రసాదు అన్నదమ్ములు కాగా వారి అమ్మ భాగానికి మూడు సెంట్ల స్థలం కేటాయించారు. మూడు సెంట్ల స్థలంలో తమ వాటా ఇవ్వాలని ప్రసాదు కొడుకు అర్లపోగు ఎల్లయ్య అలియాస్ ఎలిషా పెద్దనాన్న సీయోనుకు మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో ఈనెల 17న ఆస్తి పంపకం విషయంలో ఎలిషా తన పెద్దనాన్నతో ఘర్షణపడి కోపంతో కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. గాయాలపాలైన బాధితుడు కర్నూలు ప్రభు త్వ వైద్యశాలలో చికిత్సపొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎలిషాపై కేసునమోదు చేసిన పోలీసులు శుక్రవారం 80 బన్నూరు సమీపంలో అరెస్టు చేశారు. దాడికి ఉపయోగించిన రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుమార్తెకు కిడ్నీ ఇచ్చి బతికించుకున్న తల్లి

కర్నూలు(హాస్పిటల్): ప్రాణాపాయ స్థితిలో ఉన్న 12 ఏళ్ల కుమార్తెకు తల్లి కిడ్నీ ఇచ్చి బతికించుకుంది. చికిత్స వివరాలను శుక్రవారం కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌లో సీఓఓ సునీల్ సేపూరి వివరించారు. సహస్ర అనే బాలికను కాళ్లు, ముఖం వాపు, ఆకలి లేకపోవడం లాంటి సమస్యలతో తల్లిదండ్రులు గత నెల 31న కర్నూలు కిమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చారన్నారు. వైద్య పరీక్షల్లో బాలిక కిడ్నీలు విఫలమైనట్లు తెలిసిందన్నారు. ముందుగా డయాలసిస్ ప్రారంభించి కిడ్నీ మార్పిడి చేయాలని నిర్ణయించారు. కిడ్నీ ఇచ్చేందుకు తల్లి ముందుకు రాగా వారిద్దరి రక్తం గ్రూపులు వేర్వేరు కావడంతో ప్రత్యేకమైన డీసెన్సిటైజేషన్ ప్రోటోకాల్ అమలు చేశారు. ముందుగా ప్లాస్మా మార్పిడి చేశారు. మందుల ద్వారా శరీరంలో యాంటీబాడీల స్థాయి తగ్గగానే ఈ నెల 1న కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ నెల 10న ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. పునః వైద్యచికిత్స కోసం పాపను ఆసుపత్రికి తీసుకురాగా పూర్తిగా కోలుకున్నట్లు వైద్యులు వెల్లడించారు.


చాకరాజువేముల శివారులో విరబూసిన తామ పూలు

తామర.. సొగసు చూడ తరమా..!



పవిత్రత, స్వచ్ఛత, దైవత్వం, ప్రేరణకు చిహ్నంగా తామర పుష్పాలను భావిస్తారు. నీటి కొలనులో విరబూసే ఈ తామర పుష్పాలను అటు పూజల్లో, ఇటు ఆయుర్వేద వైద్యంలోనూ వినియోగిస్తారు. ఈ పుష్పాలకు ఉండే లక్షణాల బట్టి ఎంతో విశిష్టతగా పరిగణిస్తారు. చాకరాజువేముల, ఉమాపతినగరం, గుండుపాపల గ్రామా ల్లోని నీటికుంటల్లో తామర పూలు విరబూసి కనువిందు చేస్తున్నాయి. ఎంతో అందంగా కనిపిస్తూ తామర.. సొగసు చూడ తరమా అనేలా మనసు దోచేస్తున్నాయి.

– డోర్నిపాడు